# మావూరి కథలు



డా॥ నక్కా విజయరామరాజు

# మా వూరి కథలు

(నవ్య వీక్లీ ధారావాహిక, 7 మార్చి-15 ఆగస్టు, 2012)

**డా॥ నక్కా విజయరామరాజు**

© రచయితవి

nakkavrraju@gmail.com

ప్రథమ ముద్రణ: డిసెంబర్ 2013
ప్రతులు: 1000

ముఖచిత్రం: **పద్మశ్రీ, డా॥ బాపు**

లోపలి చిత్రాలు
**మోహన్, పినిశెట్టి**

ప్రచురణకర్త చిరునామా
**డా॥ నందిని**
నందిని స్కానింగ్ సెంటర్
1-1-4/6, రాజగృహ, మహాలక్ష్మీ కాలనీ,
ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా-503 224.
ఫోన్: 08463-223768. సెల్: 9440747768

ప్రతులకు
విశాలాంధ్ర బుక్‌హౌస్- అన్ని బ్రాంచీలు
నవోదయ పబ్లిషర్స్, విజయవాడ

లే అవుట్
**అక్షర క్రియేటర్స్**
ఎజి-2, 'ఎ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్,
హైదర్‌గూడ, హైదరాబాద్-029. ఫోన్: 040-23244088

ముద్రణ
**కళాజ్యోతి ప్రాసెస్ ప్రై.లి.**
ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్. ఫోన్: 040-27612436

వెల: **₹ 180 $10**

# ఇదీ వరస


| | | | |
|---|---|---|---|
| 1. | రికార్డుబ్రేక్ | ... | 15 |
| 2. | గోపాలరావుగారి పెద్ద గుమాస్తా | ... | 25 |
| 3. | జానీ సైకిల్‌షాపు | ... | 35 |
| 4. | చంటమ్మ | ... | 45 |
| 5. | సుబ్బారావుకు కోపం వచ్చింది | ... | 55 |
| 6. | కాగలకార్యం | ... | 67 |
| 7. | ఊళ్లో అంతా గుడ్డోళ్లే | ... | 75 |
| 8. | అమెరికా రాజయ్య | ... | 87 |
| 9. | మంత్రసాని | ... | 99 |
| 10. | పెద్ద మున్సబు | ... | 109 |
| 11. | తోకలోళ్ల ఆంబోతు | ... | 119 |
| 12. | షావుకారి సుబ్బయ్య | ... | 129 |
| 13. | మురిగేసు | ... | 139 |
| 14. | అయ్యంగారింట్లో అంతే | ... | 149 |
| 15. | లాగూసొక్కాయన్ది మావూరే | ... | 157 |
| 16. | వానాకాలం చదువులు | ... | 165 |
| 17. | గన్నర్ | ... | 173 |
| 18. | కనగాల చెవిటి సాయిబు | ... | 181 |
| 19. | ప్ర.సా.దు. | ... | 191 |
| 20. | ఎంకటమ్మ | ... | 201 |
| 21. | సర్కస్ సుబ్బారావు | ... | 211 |
| 22. | ఉత్సవ విగ్రహాలు | ... | 221 |
| 23. | అయ్యవారు | ... | 231 |
| 24. | పండగలచ్చిమి | ... | 241 |
| 25. | కిస్మిస్ పండుగ | ... | 251 |
| 26. | అన్నీ తెల్సిన తెనాలాయన | ... | 261 |

# రికార్డు బ్రేక్

బద్ధకంగా పొగమంచును చీల్చుకుంటూ బయటి కొస్తున్నాడు సూరీడు. మంచినీళ్ల గిలకబావి దగ్గర్నుంచి ఆడమగ అన్నతేడాలు లేకుండా పోటీలు పడి నీళ్లు తోడు కెల్తున్నారు. బావి గిలక సాయిబు అజావేసిన దగ్గర్నుంచి అలుపు సొలుపు లేకుండా సప్పుడు చేస్తూనే వుంది. పల్లెలో ఎక్కడ చూసినా పండగ హడావిడే!

చర్చి ముందున్న తాటాకుపందిరిలోకి చెమటలు కక్కుతూ వచ్చిన పప్పుల ఖాశిం నెత్తిమీదున్న ఎక్సైడ్ బ్యాటరీని దించాడు సాంబయ్య. ఆయన వెనకే వచ్చిన పంతగాని బాసి నెత్తి మీద నుంచి రేకుపెట్టె దించారిద్దరు మనుషులు.

పందిట్లో రంగుకాగితాలు అంటించే పిల్లలంతా మైకుపెట్టె చుట్టూ మూగారు. ''మైకుసెట్టు వచ్చిందిరోయ్,'' అంటూ గోల గోలగా అరుచుకుంటూ.

సైకిల్ తొక్కుకుంటూ వచ్చిన పసి, ఆ పెట్టె తెరిచి దాంట్లోంచి యాంప్లిఫైర్, గ్రాంఫోన్ తీసి తాటాకు చాపమీద పెట్టాడు. వైర్లను బ్యాటరీకి, పందిరిగుంజలకు కట్టిన లౌడ్‌స్పీకర్లకు కనెక్షనిచ్చి పిన్ను పెట్టి, రెండుసార్లు కుంయ్.... కుంయ్ .... అనిపిం చాడు. పెట్టెలోంచి లక్క రికార్డులను బయటికి తీసి వాటిలోంచి నాలుగు రికార్డులు ఏరి పక్కన పెట్టుకున్నాడు. ఒక రికార్డు తీసి చేతిగుడ్డతో శుభ్రంగా తుడిచి గ్రాంఫోన్ మీద ఎక్కించి, స్టీలుకమ్మిని గిరగిర తిప్పి 'కీ' యిచ్చి ముల్లును గిరగిరా తిరుగుతున్న రికార్డుమీద పెట్టగానే- 'చింతలేదిక ఏసు పుట్టెను వింతగ బెత్లేహేము నందున చెంత చేరను రండి సర్వజనాంగమా సంతస మొందుమా,' అనే పాట ఊరంతా మారు మోగింది.

చుట్టూ మూగిన పిల్లలంతా రికార్డు మీద తిరుగుతున్న కుక్కబొమ్మ వంకే కన్నార్పకుండా చూస్తున్నారు. ఆరోజు వెయ్యాల్సిన క్రైస్తవ పాటలున్న రికార్డులన్నీ తీసి

పక్కన పెట్టి మధ్యమధ్యలో గ్రాంఫోన్‌కు 'కీ' ఇస్తున్నాడు పసి. పిన్నుల డబ్బాను తనతో పాటు వచ్చిన పిల్లోడికిచ్చి 'జాగ్రత్తరోయ్,' అన్చెప్పి, నాలుగు ఏసుక్రీస్తు పాటలున్న రికార్డులు తీసుకుని చెరువుకట్ట మీదున్న మాదిగగూడెం వెళ్లిపోయాడు, అక్కడ మైకు పెట్టడానికి.

పసి వెళ్లిపోయిన తర్వాత మైకు పెట్టే పిల్లోడే హీరోలాగా కనబడ్డాడు చుట్టూ జేరిన పిల్లలకు. మైకులో నుంచి వచ్చే పాటలతో పల్లెకు పండగ సందడి వచ్చేసినట్ట య్యింది. పాటలు విని ఇంకొంతమంది పిల్లలు మైకు దగ్గరకు లగెత్తుకొచ్చారు.

పల్లెలో చర్చిలేదు. పండగలప్పుడు బడే చర్చి అయిపోయేది. పెళ్లిళ్లు చేసేది కూడా దాంట్లోనే.

పొద్దు పొడవక ముందు నుంచే జీలకర్ర ఎంకటసామి హోటల్ జనంతో కిటకిట లాడిపోతుంది. "పల్లెలో మైకు మోగుతుందేంటి బావా! ఎవురుదన్నా పెళ్లా ఏం?" అనడుగుతున్నాడు వంగర వీరయ్య కాఫీ చల్లార్చుకుంటూ.

" ఇయ్యాల కిస్‌మిస్ పండగ కదరా! పసిమైకుల్లోంచి ఈ రోజంతా ఏసుపెభువు పాటలే!" అన్నాడు ఇడ్లీతింటూ బట్టు అంజియ్య.

"అసలు పసిమైకు గానీ లేకపోతే కిస్‌మిస్ పండగే కాదు, ఊళ్లో ఏ పండగైనా చేసుకున్నట్టే వుండదు బాబాయ్," అన్నాడు అప్పుడే వచ్చి పక్కన కూర్చున్న జొన్నాదుల.

"ఒక్క పండగలేందిరా! పురిటినీళ్ళకైనా, సవర్త బంతికైనా, పెళ్లికయినా, గుడి తిరణాలకయినా చివరికి దినానికైనా పసి మైకు లేకపోతే ఊళ్లో సందడేం వుందిరా అబ్బాయ్...? పసి మైకు పెట్టకపోతే ఊళ్లో ఏంజరుగుతుందో జనాలకెట్టా తెలుసు ద్దిరా?" అన్నాడు కాఫీ తాగుతా అందే వరదయ్య.

జిక్కీ, లీల, కోమలి పాడే క్రైస్తవ భక్తిగీతాలతో ఊరంతా హోరెత్తిపోతుంది.

★ ★ ★

పెద్దబజారు రథంసెంటర్లో కూరగాయలకొట్టు ముందున్న వేపచెట్టు కింద కూర్చున్నాడొక నడివయసాయన. ఆయన పక్కనే నల్లకుక్క నిలబడి తోక ఊపుతూంది. ఆ చెట్టు చూట్టూ దిమ్మె కట్టి సిమెంటుతో గచ్చుచేసి వుంది. ఆ దిమ్మకు పడమర పక్కన కొంతమంది కుర్రోళ్లు కూర్చుని పులిజూదం ఆట ఆడుతున్నారు. ఆ వేపచెట్టుని ఆనుకుని వున్న పెంకుటిల్లే పసి యిల్లు. దిమ్మమీద కూర్చుని కొంతమంది న్యూస్‌పేపర్ తలో పేజి పంచుకుని చదివేస్తున్నారు.

'లేతలేత బెండకాయలు, పూవంకాయలు, చేదుల్లేని దోసకాయ,'లంటూ పెద్దపెద్దగా అరుస్తున్నాడు కూరగాయల కొట్లోంచి నందం.

అప్పుడే ఇద్దరు మనుషులు వేపచెట్టు దగ్గరకు వచ్చి, బిత్తరబిత్తగా చూస్తూ - "మైకు పెట్టే పసిగారిల్లు ఏడండీ? ఈడ రథం కాడే అన్నారే!" అన్నాడు వారిలో పొట్టిగా వున్న మనిషి. కూరగాయల బేరంతో బిజీగా వున్న నందం పని గూసేపాపి- "ఏ వూరండీ తవర్ది? బొంబాయా, హైద్రాబాదా? చెన్నాపట్నామా?" అన్నాడు ఎకసెక్కంగా.

# చంటమ్మ

ఆడ, మగ, నడికారు, పిల్లలు, ముసలీముతక అన్న తేడా లేకుండా ఊరి జనమంతా పడమటి ఎంకయ్య ఇంటి ముందు కూర్చున్నారు. వెన్నెల పిండారబోసినట్లుంది. కొంతమంది పిల్లలు కర్రిపెద్దయ్య ఇంటి ముందు దొంగపోలీసు ఆటలాడుకుంటు న్నారు. వరిగడ్డి, జనపనార గోతాం పట్టాలు, ఈతాకు చాపలు, చెక్కపీటలు, నులక మంచాలు అలా ఏది దొరికితే అదేసుకుని ఎవరికనుకూలమైన చోటున వాళ్లు కూర్చున్నారు. కొంతమంది బీడీ దమ్ముకొడుతూ లోకాభిరామాయణంలో పడ్డారు.

గంట నుంచి 'డింకు డిడ్డాం... డింకు డిడ్డాం...' అంటూ డక్కీలు వాయిస్తు న్నారు తోక పెంటయ్య, జోగిదాసు. పైజామా లాల్చీ వేసుకుని ఆపకుండా డక్కీ వాయిస్తున్న తోక పెంటయ్య బుర్రకథలో రాజకీయం చెప్పేవాడు. చైనా నాయకుడు మావో నుంచి ప్రధానమంత్రి నెహ్రూ దాకా ప్రపంచంలో జరిగే రాజకీయమంతా అరటి పండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెప్పేవాడు. ఇక రెండో వంత జోగిదాసు ఆసికం చెప్పేవాడు. ఆయన చెప్పే ఆసికానికి జనం పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వేవాళ్ళు. ఒక ఊళ్ళో చెప్పింది ఇంకో ఊళ్ళో చెప్పకుండా బోల్డన్నీ ఆసికాలు చెప్పేవాడు.

భుజాన తాంబూర, కుడిచేతి బొటనవేలికి అందెలు, రంగురంగుల నిలువు టంగీ, బిగుతుగా సురవా, కాళ్ళకు గజ్జెలు, చేతిలో రుమాలుతో బుర్రకథ సామ్రాట్ షేక్‌నాజర్‌లా వేషం వేసుకున్నాడు కోలాటం బసవయ్య. జిలుగుల 'బుర్రకథ' డ్రెస్సు లో- ఓ పక్కగా నిలబడి చార్మినార్ సిగరేట్ దమ్ము కొడుతున్నాడు. ఆయన్నే అంతా 'బుర్రకథ బసవయ్య' అంటారు.

"అచ్చం బుర్రకథసెప్పే నాజర్‌లాగా వుండాడు కదరా?" అని మురుగేసు అంటుంటే- "లాగా ఏందహె... ఆ డ్రస్సులో అచ్చుగుద్దినట్టు నాజర్‌లాగే ఉంటే," చెబుతున్నాడు శ్రీరామచెంచయ్య. కథ వింటానికి అప్పుడే పెద్దారం నుంచి పది మందికి పైగా కుర్రోళ్లు వచ్చారు. తోకల కోటమ్మ ఇంటిముందున్న కొబ్బరిచెట్టు కింద నిలబడ్డారు. అటూ ఇటూ గూసేపు చూసి, "డక్కీలు వాయించే వాళ్లున్నారు, కథచెప్పే కోలాటం బసవయ్య రడీగా వుండాడు, ఇంకాలీస్యం దేనికి? కథ మొదలెట్టొచ్చుగా," అన్నాడు వాళ్ళలో ఒకతను, శెరాబందీతో.

"కథ మొదలెట్టొచ్చు కానీ... చంటమ్మ రావాలిగా? ఎంతమందొచ్చినా ఆమె రాకపోతే కతెట్టా మొదలెడతారు?" అన్నాడు ఎకసెక్కంగా శెరాబందీ. పక్కనున్నోళ్ళంతా పకపకా నవ్వారు.

జనాల్ని తోసుకుంటూ భుజాన పడకకుర్చీతో గంటయ్య దారి చూపిస్తుంటే, ఆయన వెనకే మరచెంబు, దిండ్లు దుప్పట్లు తీసుకుని నాగేసు వస్తున్నాడు. వాళ్ల వెనగ్గా వాలగరెబ్బలా దబ్బపండు రంగులో వుండే చంటమ్మ వస్తుంది. ఆమె ముక్కు బేసరకున్న రాయి మీద పెట్రోమాక్సులైట్ కాంతి పడి తళుక్కున మెరిసింది. ఆమె చేతికున్న బంగారు మురుగులు ఒంటి రంగులో కల్సిపోయినయి. మెడలోని కాసుల పేరు, కాళ్ళకు వెండి కడియాలతో ఆమె నడిచి వస్తుంటే అక్కడున్న వాళ్ళందరి కళ్ళు ఆమెవైపే! చంటమ్మ వస్తుంటే కూర్చున్న జనమంతా పక్కకు తప్పుకుని తల గుడ్డలు తీసేసి నిలబడ్డారు. అరుగుల మీద కూర్చున్న జనం లేచి నిలబడ్డారు. 'చంటమ్మ... చంటమ్మ... వచ్చిం,'దంటు గుసగుస లాడుకొంటున్నారు జనం.

పడకకుర్చీని బుర్రకథ చెప్పే వాళ్ళ ముందు దించాడు గంటయ్య. దుప్పట్లు, తలగడలు సర్దాడు నాగేసు. ఆ ఇద్దరు చంటమ్మ జీతగాళ్లు. చంటమ్మ పడకకుర్చీలో కూర్చుంది. బుర్రకథ ట్రూపు ఆమెకు వందనం చేసి, "వినరా భారత వీరకుమారా విజయము మనదేరా! తందాన తానా..!" అంటూ మొదలెట్టి వాళ్ళు చెప్పబోయే కథల లిస్టు చదువుతూ, "కనకతార, రేచుక్క, గండరగండడు, బాలనాగమ్మ, బెంగాల్ డొక్కలకరువు, మనోరమ," చెబుతుంటే 'మనోరమ' దగ్గర కొచ్చేసరికి తలూపింది చంటమ్మ. ఆమె కిష్టమైన కథే చెప్పాలి. 'మనోరమ' కథ మొదలెట్టారు. మలికోడి కూసేదాకా వుండి లేచి వెళ్లిపోయింది చంటమ్మ. 'మనోరమ' కథంటే ఆమెకు మహా ఇష్టం!

★ ★ ★

చంటమ్మ పసుమర్తి వారింట పుట్టినా, గొట్టిపాటివారు దత్తత తీసుకున్నారు. మంచీచెడూ తెలీని వయసులోనే పెళ్ళయిపోయింది. ఏడాదిలోపే అంజినీలు పుట్టాడు.

# ఊళ్లో అంతా గుడ్డోళ్లే

కుర్రోళ్ళంతా శివాలయం దగ్గర జేరారు. వాళ్ళతోపాటు బడిపిల్లలు, నడికారు కలిశారు. వాళ్ళ మధ్యలో నిలబడ్డ పెద్దిరాజులు చేతిలో నిమ్మకాయలు వున్నాయి.

"ఈడ్నించి రథం సెంటర్ మీదగా సీతారామయ్య సోడాకొట్టుదాటి యానయ్యగారి బడి దగ్గిరికి ఈ నిమ్మకాయని ఐదు ట్రిప్పుల్లో ఎవురన్నా యిసిరితే పదిరూపాయలు పందెం," అన్నాడు నిమ్మకాయల్ని కుడి చేతిలోంచి ఎడమచేతిలోకి గాల్లో ఎగరేస్తూ. ఇట్టాంటి చిన్నాచితక పందాలకు కుర్రోళ్ళను ఎగదోస్తూ వెంట తిప్పుకుంటూ ఉంటాడు పెద్ది రాజులు. చుట్టుపక్కల ఊళ్లలో పెద్దిరాజులంటే తెలీనోళ్ళెవరూ లేరు. చిన్నాచితక దొంగ తనాలు, పేకాటలు, కోడిపందాలు ఆయనలేందే జరగవు. ఈ సంగతులన్నీ భట్టిప్రోలు పోలీసులకు తెలిసినా, అతన్నేమీ అనేవాళ్ళు కాదు. చుట్టుపక్కల ఊళ్ళలో ఎట్టాటి దొంగతనాలు, దోపిడీలు జరిగినా భట్టిప్రోలు పోలీసులకు ఉప్పందించేది ఆడే.

"మరీ ఐదంటే కష్టం గురూ! ఏడు తడవలకైతే నేనేత్తా," అన్నాడు పక్కనే నిలబడ్డ చాకలి పోతురాజు. దసరాపండగ సందడి మొదలవడంతో పనీపాటలేని జనమంతా అక్కడే జేరారు. అప్పుడే అక్కడికొచ్చిన వీరయ్యకు పందెం సంగతి చెప్పాడు గుండేలు సుబ్బయ్య. అట్టాంటి పందాలంటే వీరయ్యకు మా సరదా! గూటంలా వుండే వీరయ్య ఎట్టాంటి పందానికైనా ఎనకాముందూ చూడకుండా ఎగిరి దూకుతాడు. నిమ్మకాయ విసరడానికి పందెంలో అప్పటికే ముగ్గురు కుర్రోళ్ళు దిగారు.

"నేను మూడు ట్రిప్పులకే నిమ్మకాయ యిసిరేత్తా" అన్నాడు వీరయ్య. "ఐదు ట్రిప్పులకే కష్టంరా బాబూ అనుకుంటుంటే, మూడుకే యిసుర్తానంటాడేంట్రా ఈడు!"

అని గొణుక్కున్నారు పందెంలో దిగిన కుర్రోళ్ళు. మూడు ట్రిప్పులంటే ఏ కుర్రోడూ ముందుకు రాలేదు.అంతా వెనక్కు తగ్గారు. పది నిమిషాలయ్యింది.

"అయితే నువ్వొక్కడివే బరిలో మిగిలేవురా వీరయ్యా! గెలిత్తే ఇరవై రూపాయ లిత్తా, నువ్వు ఓడిపోతే పదివ్వాలి," అన్నాడు పెద్దిరాజులు. "సరే"! అని వీరయ్య అనే సరికి, వీరయ్య గెలుత్తాడని కొంతమంది, ఓడిపోతాడని ఇంకొంతమంది, పదో పరకో పై పందాలు కాచుకున్నారు.

పోయిన ఏడాది సంకురాత్రి పండక్కి పైడమ్మచెరువులో చాకలిపాలెం వైపు నుంచి, మాదిగపాలెం తొర్రోడింటిదాకా కొబ్బరికాయ విసురుకుంటా ఈదడంలో వీరయ్యే గెలిచాడు. కనగాల పెద్దకాలవ వంతెన మీద నుంచి కాలువలో దూకి ఐదు నిమిషాల పాటు కనబడకుండా మునిగి ఈదడంలో మొనగాడు. రథంసెంటర్లో గుండు రాయి గుండెల మీదగా లేపి భుజాల వెనగ్గా అవలీలగా పడేసే మొనగాడు వీరయ్యే! ఇట్టాటి ప్రతి పందెంలో పెద్దిరాజులుతో పోటీ పడుతుంటాడు. పై పందాలు కాచు కోవడం అయిపోయింది. గజనిమ్మకాయను వీరయ్యకిచ్చాడు పెద్దిరాజులు.

అప్పుడే కోటేసు హడావిడిగా వచ్చి- "నువ్వీడుండావంట్రా? నీకోసం ఊరంతా తిరిగొత్తున్నా! నిన్నరిజెంటుగా యానయ్యగోరు తీసుకురమ్మన్నార్రా పద,"ంటూ రొప్పుతూ వీరయ్య చెయ్యి పట్టుకున్నాడు. కోటేసు యానయ్యగారి పెద్దజీతగాడు.

"ఏవైందెహే!" చిరాగ్గా అడిగాడు వీరయ్య నిమ్మకాయ వాసన చూస్తూ.

"మా అయ్యగారింటికి సుట్టాలొచ్చార్రా! యాటమాసం, కోడిమాసం వండా లంట! ఏడుండా నిన్నరజెంటుగా లాక్కురమ్మన్నాడురా మా అయ్యగోరు! పద పద అంటూ," కోటేసు తొందరచేశాడు.

"వత్తాడులె గూసేపు ఆగెహె! నువ్వు కూడా నిమ్మకాయ ఇసిరే పందెం సూద్దువు గానీ. మేమంతా వీరయ్య నిమ్మకాయ ఎంత సులిసూత్రంగా యిసురుతాడో సూద్దామని ఈడుంటే, ఏందసె మద్దిలో ఆడ్ని లాక్కెల్తానంటావ్?" అన్నాడు నాంచారయ్య.

నిమ్మకాయని ఒక విసురు విసిరాడు వీరయ్య. రథంసెంటర్లో పడింది. రెండో విసురికి నిమ్మకాయెళ్ళి మున్సబుగారింటి ముందు పడింది. మూడోసారి విసిరేసరికి నిమ్మకాయ యానయ్యగారి బడి దాటెల్లి ట్రాన్స్‌ఫారం దగ్గర పడింది. ఈరయ్య గెలిచాడు. "అదరగొట్టావురా వీరయ్య! నీ దెబ్బకు తిరుగు లేద,"ంటుంటే, వీరయ్యకి ఇరవై రూపాయలిస్తూ, "ఈ ఈరిగోడు సైతాన్‌లాగా యాన్నుంచొత్తాడ్రా! పెతి పందాని కడ్డంపడి గెద్దలా తన్నుకు పోతాడ,"ని గొణుక్కుంటా వెళ్ళిపోయాడు పెద్దిరాజులు.

★ ★ ★

# మంత్రసాని

తురిమెళ్ల ప్రకాశం యింటి ముందున్న తాటాకుపందిరి కింద పేడకళ్లాపి జల్లి పొడి ముగ్గులేసున్నాయి. పందిరిగుంజకు కట్టిన పసి మైకు లౌడ్‌స్పీకరుల్లోంచి, 'ముత్యాల చెమ్మచెక్క రత్నాల చెమ్మచెక్క ఓ చెలి మురిసెనుగా,' అంటూ తూర్పు పక్కనున్న ఐలారానికి, పడమర పక్కనున్న కూరేటిపాలేనికి పాటలు హోరెత్తిస్తున్నాయి.

పల్లెలోని ఆడోల్లంతా బిందెలు, పొంతకుండలు, మట్టికడవలు, ఇనపబక్కెట్లలో పసుపు, వేపాకులు కలిపిన వేడినీళ్లు తీసుకొచ్చారు, ప్రకాశం కూతురు ఈరమ్మ పురిటి స్నానానికి. రాతిగాబు దగ్గర నులకమంచమేసి చుట్టూ దడిలాగా కోకలు కట్టారు.

ఆడకుక్కకు మెడలో వేపాకుల దండేసి, విస్తరాకు నిండా అన్నం కూరలు వడ్డించింది మంత్రసాని గడ్డం పున్నమ్మ. చుట్టూ చేరిన ఆడోల్లంతా, 'గౌరమ్మ తల్లికి దండాలంటూ,' పాట పాడుతుంటే ఇదేమి పట్టించుకోకుండా ఆబగా అన్నం తింటుంది కుక్క. ఈరమ్మతో కుక్కకు మొక్కించింది. ఆమె నీళ్ళాడి అప్పటికి ఏడోరోజు. ఆ రోజే పురిటి స్నానం. కుక్క కడుపునిండా తినేసి గాలిసొంగయ్య యింటివైపు వెళ్లిపోయింది.

"కుక్క పూజయిపోయిందిగా యింక బుడ్డోడి సంగతిసూడే పున్నమ్మా," అంది పిల్లోడి నానమ్మ. బుడ్డోడికి పురిటి స్నానం చేయించింది. ఎండిన బొడ్డు ఊడిపోయింది. ఊడిన బొడ్డులోంచి ఒక ముక్క గిల్లి తావీదులో పెట్టి దాన్ని మొలతాడుకి చుట్టి బుడ్డోడికి నడుముకి కట్టి- "ఇది నీ పెయ్యిమీదున్నంత కాలం ఏ గాలి, ధూళీ నిన్నేం సెయ్యదురా బుడ్డోడా," అంది పున్నమ్మ.

పీటలేసుకుని కాళ్లు బారచాపి కూర్చున్న పున్నమ్మ కాళ్లమీద బుడ్డొన్ని వెల్లికిలా పడుకోబెట్టి వాడి కుడిచెయ్యి ఎడంకాలు, ఎడంచెయ్యి కుడికాలు సాగదీస్తూ- "తాత జేజి! నీ తాతలకి నీ జేజిలకి, నీ అమ్మకి అయ్యకి, నీ బొడ్డు కోసిన పున్నమ్మకి నూరేళ్లు! నీకు ఎయ్యేళ్లు!" అంటూ చేట నిండా బియ్యం పోసి బియ్యం మీద వేపాకు పరచి బుడ్డోడ్ని పొడిగుడ్డతో తుడిచి పడుకోబెట్టింది పున్నమ్మ. ఆడోళ్లంతా వాడి చుట్టూ మూగారు. నల్లసాదుచుక్క నొసల మీద, బుగ్గ మీద పెట్టింది.

'సుక్కల్లో సెంద్రుడు,' అంటూ ఎకసెక్కం చేశారు చుట్టూ మూగిన ఆడపిల్లలు. "సెతుర్లకేంగానీ బుడ్డోడికి గాలి ఆడ్డం లేదు ఆసింట జరగండెహె," అంటూ కసిరింది బుడ్డోడి జేజిమ్మ.

"అబ్బో! మనవడిమీద పేమ పొంగిపోతంది పదండే!" అంది సుబ్బమ్మ. నవ్వు కుంటూ ఆడోళ్లంతా నీళ్ల దొడ్డి దగ్గరకి జేరారు. పాతిక పైగా నీళ్లకుండలు వరసగా పెట్టున్నాయి. ఈరమ్మకు ఒళ్లంతా పసుపు పూసి, కుంకుడుకాయల రసంతో తలారా స్నానం చేయించింది. అద్దేపల్లి పేటంచు కొత్తకోక కట్టి, నులకమంచం మీద కూకోపెట్టి తలకు సాంబ్రాణీ పొగేసింది పున్నమ్మ.

ఆడోళ్లంతా మళ్లీ బుడ్డోడి చుట్టూ మూగారు. "ఆ ముక్కుసూడు సుబ్బయ్య తాత బొర్ర ముక్కు కదూ."

"నోరు అత్తరమ్మే సత్తర్ సాయిబులాగా వుంది కదే?" "ఆయన్ని సూసిగాని నీళ్లోసుకుందా ఏందీ" అంతా పకపకా నవ్వారు.

పురుడుపోసి బొడ్డు కోసింది పున్నమ్మే కాబట్టి పేరు కూడా ఆమే పెట్టాలి!

"ఏమే అప్పా! నువ్వే సెప్పు, సచ్చిపోయిన మామ పేరు పెడతావా? సిల్మాల్లో ఈరో రామారావా? నాగేస్పర్రావా?" అడిగింది పున్నమ్మ బుడ్డోడి జేజిమ్మ సుబ్బమ్మ వంక చూస్తూ.

"ఎవుళ్లపేరో ఎందుకే ఆడితాత పేరే పెట్టు!!" చెప్పింది బుడ్డోడి జేజిమ్మ.

"ఇయ్యాల్నుంచి ఈడి పేరు ఎంకయ్య" చెప్పింది పున్నమ్మ.

"కట్టనాలు పెట్టేవోళ్లుంటే పెట్టండే, పొద్దు నడినెత్తికెక్కింది అన్నపేల దాట తంది," అంది పున్నమ్మ.

"ఎంకయ్యకి నా కట్టనం రూపాయి... దీంతో కనగాల చెవిటిసాయిబుతో పూల సొక్కా కుట్టిచ్చుకోరా నాగన్న," రూపాయి బుడ్డోడి చేతిలో పెడుతూ అంది బాగ్యమ్మ.

"దీంతో... అద్దేపిల్లి వంటావుదం తాగి బాగా బలం తెచ్చుకోరా బుల్లియ్యా," అంటూ బుడ్డోడి అత్త ముత్తమ్మ వాడి చేతిలో అర్ధరూపాయి బిళ్లపెట్టింది.

# మరుగేసు

గుణదల మేరీమాత కొండ మీదకు ఎక్కే జనం ఎక్కుతుంటే, దిగే జనం దిగుతున్నారు. గుంపులు గుంపులుగా వచ్చే పోయే జనంతో కొండమీద తిరణాలతిరణాలగా వుంది. గుడిమీద వెలుగుతున్న రంగురంగుల కరెంటు దీపాలు ఊరంతా కనబడుతున్నాయి. మైకులోంచి వచ్చే పాటలతో పాటు ఆటబొమ్మలు, తినుబండారాలమ్మే వాళ్ల కేకలు, అడుక్కునే వాళ్ల అరుపులతో కొండ హోరెత్తుతూంది.

సరసమ్మ, అల్లపర్రులు బెజవాడ రైలుస్టేషన్లో బండి దిగేసరికే పొద్దు గాంధీకొండ వెనక్కెళ్లిపోయింది. ఊరంతా పట్టపగల్లా దీపాలెలిగిపోతున్నాయి. కరెంటు లేని తన ఊరిని చూసి బెజవాడను చూస్తే నక్కకి నాగలోకానికున్నంత తేడా వున్నట్టనిపించింది.

"ఎంతయినా పట్నం పట్టనమేనే!" అన్నాడు ఆశ్చర్యంగా తాటిచెట్టంతున్న స్థంబాలకు వెలుగుతున్న పెద్దపెద్ద కరెంటు బల్బులు చూస్తూ అల్లపర్రు.

"అట్టా రోడ్డు మద్దిన నిలబడి నిలువుగుడ్డులేసుకుని సూత్తుంతే ఎర్రోడనుకుంటారు జనం. అదాటున ఏదన్నా మోటారు గుద్దేసినా గుద్దేసుద్ది, గూత్తి అటూ యిటూ సూసుకుని బేగినడు. ఈడే తెల్లారేట్టుం,"దంటూ తొందరచేసింది సరసమ్మ.

"ఇదేనాదారి?" అడిగింది సరసమ్మ. "ఈ రోడ్డట్టుకుని నేరుగా పోతే గుణదల మరియమ్మతల్లి కొండే! ఎన్నిమార్లు రాలేదే ఈ దారెంట పిచ్చి మొగమా?" అన్నాడు అల్లపర్రు. రోడ్డంతా ఇసకేస్తే రాలనట్టు జనంతోపాటు పెద్దగా సప్పుడు చేసుకుంటూ పోయే సిటీబస్సులు, కార్లు.

నడక వేగం పెంచారిద్దరు. "ఆ మరియమ్మ తల్లికి దండం పెట్టుకుని కొవ్వొత్తెలిగిచ్చి, తెల్లారిగట్టకి ఆ పెసర్లంక పంతులుగోరు పిల్లకాయల్తో ఏసుపెబువు పాటలు

పాడిత్తూ వచ్చే యాలకల్లా ఇల్లు జేరాలి. పండగపూట ఇంటి కాడ కొవ్వొత్తులెలిగిచ్చక పోతే పండగ సేసుకున్నట్టే వుండదు,'' నడుస్తూనే చెబుతుంది సరసమ్మ. అదేం పట్టిచ్చుకోకుండా గోడల మీద అంటించిన ఎన్టీఆర్, నాగేశ్వర్రావు, సావిత్రి, జమున లున్న 'గుండమ్మ కథ' సినిమా పోస్టర్లు చూస్తూ నడుస్తున్నాడు అల్లపర్రు.

పెళ్లయి పదేళ్ళు దాటిపోయినా సరసమ్మ కడుపు పండలేదు. వాళ్లు పిల్లలకోసం మొక్కని దేవుడు లేడు. మూడేళ్ల నుంచి గుణదల మేరీమాత గుడికొస్తున్నారు. ఏ పుట్టలో ఏ పాముందోనన్న ఆశ సరసమ్మకి. ఆలోచనల్లో ఉండగానే గుణదల జేరిపోయారు.

''కాళ్లు పీకుతున్నాయి గానీ గూసేపు ఈడ కూకుంటా! నోరు పిడచగట్టుకు పోయింది సోడా తీసుకురా,'' అంది సరసమ్మ, బొమ్మలకొట్టు దగ్గర కూలబడి. కొట్టు జనంతో కిటకిటలాడిపోతంది. కొట్టతని భార్య చెంబుతో మంచినీళ్లిచ్చింది.

''కొండెక్కి మరియమ్మతల్లికి దన్నం పెట్టుకుని మళ్లీ వత్తాం తల్లీ,'' అంది సరసమ్మ చెంబు ఆమె చేతికిస్తూ. ''పోయిట్వా'' అంది కొట్టు మనిషి. వారిది అరవ దేశం. మూడేళ్ల నుంచి ఆ బొమ్మలకొట్టు మనుషులతో ముఖమెరికె. గుడికొచ్చినప్పు డల్లా గూసేపు కొట్టుకాడ కూకుని అన్నాలు తిని వచ్చేవాళ్లు.

కొండపైకెళ్లారు. కొవ్వొత్తి వెలిగించి దండం పెట్టుకున్నారు. కొండ దిగొచ్చి అరవా యన కొట్లో కూకుని అన్నాలు తిన్నారు. ఐదేళ్లన్నా సరిగ్గా లేని పిల్లోడు మంచినీళ్లిచ్చాడు. నేరేడిపండు రంగు, బిల్లేరు గోళీల్లాంటి కళ్లతో బొద్దుగా వున్నాడు.

''ఎవురీ అబ్బాయి! పోయినేడాదొచ్చినప్పుడు అగబడలేదే?'' అడిగింది సరసమ్మ, అరవ మనిషిని.

''ఎవరి పిల్లోడో పాపం! మూడు రోజులై వచ్చి. ఏవడిగినా సరిగ్గా సెప్పడం లేదు. ఏడుస్తూ మెట్లమీద కూకుంటే తీసుకొచ్చి అన్నవెట్టాం,'' అన్నాడు అరవాయన.

''తప్పిపోయాడేమో పాపం!'' అన్నాడు అల్లపర్రు.

''అందుకే! ఆడి అమ్మానాన్నలొత్తారేమోనని ఈడే అట్టిపెట్టాం. పండగ అయి పోయిందాకా చూసి ఎవురూ రాకపోతే పోలీసులకప్పజెప్పుతాం,'' అన్నాడు అరవాయన. వాళ్లక్కూడా పిల్లలేరు.

''అయ్యో! ఏ తల్లి కన్నబిడ్డో  పాపం! ఎంత ముద్దొత్తున్నాడో,'' అంటూ సంచి లోంచి ఒక అరిసె తీసిచ్చింది సరసమ్మ. తీసుకుని తిన్నాడు. బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది. అందంగా పళ్లన్నీ ఇకిలిచ్చి నవ్వాడా పిల్లోడు.

''ఎవురూ రాకపోతే మీరే పెంచుకోండి. మీక్కూడా పిల్లల్లేరుగా,'' అంది అరవ మనిషితో మెల్లిగా. అరవ ఆడమనిషి నవ్వి ఊరుకుంది. ఇంకో అరిసిచ్చింది. బుడ్డోడు తింటుంటే కళ్లార్పకుండా చూసింది సరసమ్మ.

''లే పద పద! యింకా లేటయితే తెనాలి బండి దొరకదు. అది పోతే ఆడ దయ్యాలబండి ఎల్లిపో,''ద్దంటూ తొందరచేశాడు అల్లపర్రు. పిల్లాడ్ని వదలబుద్ధి కాలేదు.

# కనగాల చెవిటిసాయిబు

"ఇదిగో సాయిబుగోరూ ఈ గుడ్డముక్కతో నాకు రయిక, మా పెద్దబ్బాయికి లాగూ సొక్కా, బుడ్డి దానికి గౌను, ఈ సంకలో వున్నోడికి సెరాయి. పండగ రేపన్నంగా వత్తా," అంది సలగాల ఎంకటమ్మ.

దాన్ని ఉండలా చుట్టి గుడ్డపేలికతో ముడేసి చెక్కపెట్టెలో పడెయ్యబోతూ- "బుడ్డదంటే పోయినేడాది దీపావళి పండక్కి పుట్టిందేనా?" అనడిగాడు సాయిబు.

"ఆ! ఆ! అదే! దాని పురిటిబంతికి పూలపూల గౌను కుట్టిచ్చేవుగా?" ఎంకటమ్మ గుర్తు చేసింది. "ఆ! ఆ!" అంటూ చెక్కపెట్టెలో పడేశాడు సాయిబు.

కుట్టుమిషను చక్రం గిర్రున తిరుగుతూనే ఉంది. సాయిబు కాళ్ళు తొక్కుతూనే వున్నాయి. మిషను మీద గుడ్డలు కుడుతూనే అందరి మాటలు వింటూ సమాధానం చెప్పటం సాయిబుకి అలవాటు. ఆ మాటల్లో వినబడేవి కొన్ని, వినబడనివి బోల్డన్ని!.

"సాయిబన్నియ్యో! ఈ రెయిక ఎన్నిసార్లు సూత్తో కుట్టినా సంకల్లో పిగిలిపోయి సత్తందిగానీ నీ మిసను మీద రెండు కుట్లులేసియ్యి పున్నెముంటది. వచ్చే కిస్‌మిస్ పండగ దాకా ఎట్టాగొట్ట తొడుక్కుంటా," అంటూ అక్కడే నిలబడి పవిటచెంగు ముని పంటితో పట్టి జాకెట్టు విప్పిచ్చింది పంతగాని పెంటమ్మ. 'పనికి మధ్యలో అడ్డంబడితే ఎట్టా?' అన్నట్టు ఆమెకేసి ఓ చూపు చూసి మిషను మీదున్న లంగా పక్కకి జరిపి జాకెట్టు కుట్లేసిచ్చాడు సాయిబు. అక్కడికక్కడే జాకెట్టు తొడుక్కుంటూ, " మా సాయిబన్నియ్య ఎంత మంచోడో," అని నవ్వుకుంటూ వెళ్లిపోయిందామె.

మిషన్ చుట్టూ పడున్న రంగు రంగుల గుడ్డముక్కల్ని తాటాకు బొమ్మలకి కట్టడానికి ఆత్రంగా ఏరుకుంటున్నారు యిద్దరు ఆడపిల్లలు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Maa+Oori+Kathalu**

* * *